www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



బస్సు ప్రమాద ఘటనపై సిపిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమలాపురం

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నకాటేరు వద్ద శుక్రవారం తెల్లవారజామున జరిగిన బస్సు ప్రమాద ఘటనపై సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే అత్యుత్తమ వైద్య సదుపాయాలను ఉచితంగా అందించాలన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గ ప్రసాద్ ఉన్నారు.

ముసురు

అల్పపీడన ప్రభావంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారం ముసురు కొనసాగింది. వర్షాల ప్రభావంతో రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల పంటలను నేలవాలాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు దెబ్బతిన్న పంటలను పరి శీలించారు. తమను ప్రభుత్వ ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

:: ప్రజాశక్తి - యంత్రాంగం ::



ఉప్పలగుప్తంలో నేలవాలిన వరిచేను

పంటలకు తీవ్ర నష్టం

రామచంద్రపురం: కె.గంగవరం మండలంలో 15560 ఎకరాల్లోనూ, రామ చంద్రపురం మండలంలో 17262 ఎకరాల్లోనూ వరి పంట సాగు అవుతోంది. భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పెట్టుబడులు వస్తాయా లేదని రైతులు ఆందోళ నకు గురవుతున్నారు. భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వేయ డంతో సుమారు 30 శాతం పంట చేలు నేలకొరిగినట్లు రైతులు తెలియ జేస్తున్నారు. వర్షాలకు నీరు కాలువలను పంట చేలలోను అధికంగా చేరడంతో రైతులు నీటిని మురుక్కాల వరకు దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సామాన్యులు ప్రయాణికులు వర్షాలకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.




కుందూరులో మునిగిన పంటను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

పంటలను పరిశీలించిన మంత్రి సుభాష్

భారీ వర్షాలకు గాలివానల కారణంగా, నీట మునిగిన పంట పొలాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అన్నారు. రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకున్నారో తెలుసుకొని ఒక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం, కె. గంగవరం, కాజులూరు మండలాల్లో మొత్తం 36,511 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని, అందులో సుమారు 2,056 ఎకరాల్లో పంటలు పడిపోయినట్లు గుర్తించామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పంటల పరిశీలనలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ, నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 68 పిపిసిలు ద్వారా ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు ఈ అక్టోబర్ 27 నుంచి నవంబర్ 10 ప్రారంభమయ్యే అవకాశం ఉందని మంత్రి సుభాష్ వెల్లడించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు, అధికారు లు ఉన్నారు.

కపిలేశ్వరపురం: భారీ వర్షాలకు పలు గ్రామ పరిధిలో వరి చేలు నేలనంటాయి. జనాలు బయటికి వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునే పరిస్థితి లేకుండా పోయింది. పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరుతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. **మండపేట:** వర్షాల కారణంగా వరి కోతలు వారం రోజులు పాటు వాయిదా వేసుకోవాలని ఎ.ఇ.ప్రభాకర్ సూచించారు. ఏడిద గ్రామంలో పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. **ఆలమూరులో** భారీ వర్షాలకు, ఈదురుగాలులకు వరిపంటలు నేలకొరగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ముంపుబారి నుంచి పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పెద్దపల్ల గ్రామానికి చెందిన రైతు మేడిశెట్టి కొండయ్య కౌలుకు పండిస్తున్న తన పొలంలో నేలకు ఒరిగిన పంటను చూపించి ఆవేదన వ్యక్తం చేశారు.నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. ఉద్యాన పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించామని ఎ. మీనా తెలిపారు. మండలంలో 555 ఎకరాలు పంట నష్టం వాటిల్లిందన్నారు. **ఆత్రేయపురంలో** 17 గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. పంట నానడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరిచేలు ఈనిక దశ, వడ్ల గింజ పాలు పోసుకునే సమయం, మరికొన్ని పొలాలు ఒక వారం రోజుల్లో కోతకు వచ్చే దశకు వచ్చాయి. **ఉప్పలగుప్తంలో** భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మండలంలోని మురుగు కాలువలన్నీ ఆక్రమణలకు గురై ముంపు నీరు దిగక వరిచేలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 1,680 ఎకరాలు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఎస్.యానాంలో మురుగు కాలువలు పోటెత్తడంతో వీధులన్నీ ముంపు నీటితో నిండిపోయాయి. **మామిడికుదురులో** వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రధాన రహదారులు పంట కాలువలా తలపిస్తున్నాయి. వరి చేలు నేలకు వరిగాయి. డ్రయినేజీలు ఆక్రమణలకు గురి కావడంతోపాటు, తూడుతో నిండి పోవడం తో మురుగు నీరుప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. **ముమ్మిడివరంలో** కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని పెన్నాడవారిపాలెం సమీపంలో బొబ్బర్లంక - పల్లంకుర్రు ప్రధాన కాల్వ రక్షణ గోడ కుంగి బీటలు వారింది. పంట కాలువ గట్టును ఆనుకొని రక్షణగా నిర్మించిన సిమెంట్ వాల్ కు రోడ్డుకు మధ్య వర్షపు నీరు నిలిచిపోవడంతో సిమెంట్ వాల్ కుంగిందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన



కేశవదాసుపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి మండలంలో తీవ్ర వర్షాలు కారణంగా ముంపుకు గురైన గ్రామాలను రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్. రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్యలతో కలిసి పరిశీలించారు. శుక్రవారం తీరప్రాంత గ్రామమైన కేశవదాసు పాలెం గ్రామంలో ప్రజల ఇబ్బందులను అడిగితెలుసుకొన్నారు. కాల్వమొగ నుంచి చింతలమోరి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా జలమయం అవి, గత కొన్నేళ్లుగా వర్షాకాలంలో పెద్ద కాలువలా మారుతుందని స్థానికులు వాపోయారు. ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ఎంఎల్ఎ దేవకు తెలిపారు. ఆగస్టిన్ కాలనీలో నివాస ప్రాంతాలని పరిశీలించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ముంపునీటిని మళ్లించేలా జెసిబి సాయంతో తొలగించి, డ్రెయిన్స్‌లోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ అధికారులను ఆదేశించారు. తాగునీటి ట్యాపులు గ్రౌండ్ లో పల ఉండటం చేత తాగునీరు పట్టుకొనే అవకాశం కూడా లేదని కాలనీ వాసులు వాపోయారు. దీంతో ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శిరీషకు ఎంఎల్ఎ ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దార్ ఎం. వెంకటేశ్వరరావు, నాయకులు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, గొల్ల జేస్సాల్, ఉండపల్లి అంజి, పోతురాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి ధ్వంసమైన పూరిండ్లు

సఖినేటిపల్లి మండలం . అంతర్వేదికర గ్రామంలో పోతురాజు సుబ్బారావుకు చెందిన పూరి గుడిసె వర్షాలకు ధ్వంసం అయింది. రెక్కాడితేనే గాని డొక్కాడని కుటుంబం తనదని, ఆయన తన తల్లితో కలసి జీవిస్తున్నానని ఆయన తెలిపారు. వర్షాలతో ఇంటి పైకప్పు పాడవడంతో నిలవ నీడకోల్పోయామని, ప్రభుత్వం సహాయం చేయాలని ఆయన తల్లి అధికారులను కోరుతున్నారు.



అంతర్వేదికర గ్రామంలో వర్షాలకు కూలిన తాటాకిల్లు

రోడ్లు జలమయం

అధిక వర్షాలతో సఖినేటిపల్లి మండలం అతలాకుతలమయింది. చాలావరకు రోడ్లు జలమయం కావడంతో వాహనాలు ముందుకు వెళ్లలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కేశవ దాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నష్టపరిహారం అందించాలి : వైసిపి

రామచంద్రపురం: వర్షాల కారణంగా తొలకరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మండలంలోని యనమదల, శీలం వారి సావరం గ్రామాల్లో నేల వాలిన వరిచేలను పరిశీలించారు.రైతుల పరిస్థితిని గమనించిన ఆయన, పంట నష్టానికి తగిన పరిహారం ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పెట్టుబడులు పెట్టి నష్టాలు చవి చూస్తే మళ్లీ వ్యవసాయం చేయాలంటేనే కష్టంగా ఉంటుందని, వెంటనే రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, సర్పంచులు పంపన వీర వెంకటరమణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, నేదూరి జగ్జీవన్ రావు, పెంకె వీరరాఘవులు, ఎంపిటిసి సభ్యుడు నురుకుర్తి శ్రీరామకృష్ణ, నాయకులు రెడ్డి గోవిందు, కడలి కొండ రైతులు పాల్గొన్నారు.



యనమదలలో నేలవాలిన చేలను పిల్లి సూర్య ప్రకాష్

ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి - ఆలమూరు


పెదపల్ల, మడికి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం ఆయా సర్పంచులు ఏడిద సత్య శ్రీ మెహర్ ప్రసాద్, ఉండ్రాసపు లక్ష్మీ మౌనికల అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. 2026- 2027కు సంబంధించి గ్రామాల్లో గుర్తిం చిన ఉపాధి హామీ పనుల వివరాలను గ్రామ సభలో ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు చదివి వినిపించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు ఇకెవైసి చేయించుకోవాలని ఇంజినీరింగ్ కన్సల్టెంట్ పి.ప్రకాష్ వివరించారు. పెదపల్లలో 37 పనులు, మడికిలో 36 పనులు గుర్తించినట్లు తెలిపారు. ఈ పనుల వివరాల నివేది కను ఉన్నతాధికారులకు తెలియజేయునన్నట్లు ఇసి ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో నేతలు నెక్కంటి సూర్య ప్రకాషరావు, కార్యదర్శులు వి.వేణి, బి.వెంకటరత్నం, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎ.రామకృష్ణ, జి.గన్నియ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్ టిసి బస్ స్టాండ్ ను వెంటనే పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవికుమార్ చేపట్టిన రిలే దీక్షకు పలువురు సంఘీ భావం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలేదీక్ష శుక్రవారం 14 రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ రవికుమార్ దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం అన్యాయ మన్నారు. రవికుమార్‌కు సంఘీభావంగా దీక్షలో కె.వేణు కుమార్, పి.బాల ఆనంద్ కుమార్, వై.బాలరాజు, జి.రాంబాబు, జి.హరీష్ ఎం.చినబాబు పాల్గొన్నారు.

కార్టూన్‘నిజం’



గోదారి జలాలు కడలి పాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఇంక్యుబేషన్ కేంద్రాలు నెలకొల్పేందుకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో రావులపాలెం సమీపంలో అరటి, అమలాపురం పరిసర ప్రాంతాల్లో కొబ్బరి ఉత్పత్తుల తయారీపై శిక్షణ, ఉత్పత్తుల ప్రోత్సాహకంపై అవగాహన కొరకు ఇంక్యుబేషన్ కేంద్రాలు నెలకొల్పేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం స్థాని కలెక్టరేట్ నందు ఉద్యాన విశ్వవిద్యాలయ ఫుడ్‌ప్రాసెసింగ్ శాస్త్రవేత్తలు అధికారులతో సమావేశం నిర్వహించి అవసరమైన స్థలాలు కేటాయిస్తూ ఇంక్యుబేషన్ సెంటర్లు నెలకొల్పేందుకు చేపట్టాల్సిన చర్యలు డిపిఆర్లు రూపకల్పన వంటి అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. సమావేశంలో ఉద్యాన యూనివర్సిటీ హెడ్ ముత్యాల నాయుడు, ప్రిన్సిపల్ సెంట్రల్ అండ్ హెడ్ అంబాజీపేట తిరుపతిరెడ్డి, పోస్ట్ హార్వెస్టింగ్ రీచార్జ్ సెంటర్ డాక్టర్ సృజన, లింకుమ్బేషన్ సెంటర్ ఇన్చార్జ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హ్యుమానిటీ క్లబ్ 11వ యూనిట్ చైర్మన్‌గా మినర్వా రమేష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ భావనతో ప్రారంభించనున్న మోడరన్ హ్యుమానిటీ క్లబ్ ఆవిష్కరణలో భాగంగా శుక్రవారం మినర్వా విద్యాసంస్థల అధినేత రమేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. మోడరన్ హ్యుమానిటీ క్లబ్ యూనిట్ చైర్మన్‌గా ఆయనను జివి.రావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్‌కు మోడరన్ హ్యుమానిటీ క్లబ్ విధివిధానాలు జివి.రావు వివరించారు. ఈ ప్రతిపాదన పట్ల రమేష్ సానుకూలంగా స్పందించినట్లు జివి.రావు పేర్కొన్నారు. రమేష్ ఆధ్వర్యంలో 30 మంది కూడా సభ్యత్వం తీసుకొనడానికి కార్యచరణ రూపొందించినట్లు జివి.రావు పేర్కొన్నారు. మోడ్రన్ విద్యాసంస్థల ఉద్యోగులు శ్రేయోభి లాషులు, పూర్వ విద్యార్థులు, మోడరన్ హ్యుమానిటీ క్లబ్ నందు భాగస్వామ్యులుగా చేరతారని రావు వివరించారు.

బీచ్ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


వచ్చే ఏడాది జనవరిలో జరిగే సంక్రాంతి సంబరాలు సందర్భంగా ఎస్.యానం బీచ్ లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు బీచ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా పారదర్శకంగా చేపట్టాలని పంచాయతీరాజ్ డిఇఇ పిఎస్.రాజ్‌కుమార్‌కు సూచించారు. సంక్రాంతి సంబరాలకు రోజుకు రెండు లక్షల నుంచి 3 లక్షల మంది వరకు సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏ ఒక్కరికి అసౌకర్యం కలగకుండా ప్రణా ళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. నాయకులు అయితాబత్తుల రాజశేఖర్, పంచాయతీరాజ్ ఎఇ వి.రాధాకృష్ణ ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని ముమ్మిడివరం ఎంపిపి కొలా గంగాభవాని సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం ఎంపిపి గంగాభవాని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ దీక్షితులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ ర్యాలీ కరపత్రం ఆవిష్కరణ



పి.గన్నవరంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - పి.గన్నవరం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ కరపత్రాలను నియోజకవర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్, సిఇసి సభ్యురాలు పాముల రాజేశ్వరిదేవిలు ఆవిష్కరించారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ ఆదేశాల మేరకు ఈనెల 28న మెడికల్ కళాశాలలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రజా ఉద్యమ ర్యాలీ జరుగుతుందని పార్టీలకతీతంగా అందరూ హాజరై ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఇసి సభ్యురాలు పాముల రాజేశ్వరి దేవి, మందపాటి కిరణ్, మండల పార్టీ అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, సీనియర్ నాయకులు దొమ్మేటి వెంకట శివ రామన్, రాష్ట్ర నాయకులు చాట్ల రామారావు, జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, దాసరి కాశి, యాండ్ర నాగేశ్వరరావు, వస్కా రామారావు,తులా గోపాలకష్ణ, అడ్డగళ్ల శ్రీను, కుడుపూడి సత్తిబాబు, గూటం జోష్, ఎమ్.సుమంత్, పమ్మి ప్రభాకర్, కొల్లు బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమం ర్యాలీ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం రామచంద్రపురం నియోజ కవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ పోస్టర్ను విడుదల చేశారు. పార్టీ నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడువనుం సుబ్బారావు, ఎంపిపి అంబటి భవాని, మండల కన్వీనర్లు పోలినాటి ప్రసాద్, పెట్టా శ్రీనివాస్ , పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ , మహిళల విభాగం నాయకులు ఎల్లమెల్లి సతీష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అంబాజీపేట

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబాజీపేట హైస్కూల్ నందు 8, 9, 10 తరగతులలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన వక్తృత్వ మరియు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ఈ పోటీలకు తొమ్మిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మండల స్థాయి క్విజ్ పోటీలలో పి.మనస్విని(తొండవరం హైస్కూల్), బి.డింపుల్ సాయి వరలక్ష్మి (అంబాజీపేట హైస్కూల్), సిహెచ్.జయశ్రీ (పుల్లేటికుర్రు హైస్కూల్) నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి ఈనెల 29న జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనారన్నారు. విజేతలను హెచ్‌ఎం కె.సాయిరాం, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మురళీధర్, ఆనంద్‌కుమార్, శేఖర్‌లు, సిఆర్‌ఎంటిలు టి.నాగరాజు, పి.గోవిందరాజు, టి.సత్య నారాయణ, ఎం.దుర్గారావు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు వారిని అభినందించారు.



ఎంపికైన అంబాజీపేట మండల విద్యార్థులతో ఎంఇఒలు


‘మందపల్లి’ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగ భూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంత లక్ష్మీసావిత్రి, దేవపాటి వేంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగశిరోమణి, తణుకు వీరభద్ర రావు, కముజు స్వప్న, అయలూరి శ్రీరామ్మూర్తి, అర్చక మరియు ఎక్స్‌అఫిషియో సభ్యులు చే కార్యనిర్వహణ అధికారి సురేష్‌బాబు పర్యవేక్షణలో ముఖ్య అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి యాత్రికుల సౌకర్యార్థం సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన 28 స్నానగదుల సముదాయాన్ని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రారంభించారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిలుగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజక వర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ శ్రీమందేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కృష చేయాలన్నారు. విజయ నగరం మహారాజా వంశీకులు, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ గా ఉన్న ఈ ఆలయం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాలూరు సత్యానందం, మందపల్లి ఎంపిటిసి సభ్యుడు సిద్ధంశెట్టి వీర వెంకటసత్య నారా యణ, మాజీ ఛైర్మన్‌లు చింతం విజయకృష్ణ మోహనరావు, ధరణాల రామకృష్ణ, కొత్తపేట పిఎసిఎస్ ఛైర్మన్ కంటంశెట్టి సత్యప్రసాద్, పలి వెల పిఎసిఎస్ ఛైర్మన్ తులారాజు, మండల పార్టీ అధ్య క్షుడు జి.వీరేశ్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బి.ఆది నారాయణ, కనకేశ్వరరావు, టిడిపి నాయకులు ముత్యాల బాబ్జీ, కంటంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన ధర్మకర్తల మండలితో ఎంఎల్ఎ సత్యానందరావు, శ్రీనివాస్



మృతుడు శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులు

రావులపాలెంలో విషాదం

కర్నూలు బస్సుప్రమాదంలో శ్రీనివాసరెడ్డి సజీవదహనం

ప్రజాశక్తి - కొత్తపేట



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రావులపాలెంలో విషాదం నెలకొంది. కర్నూలులో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో రావులపాలేనికి చెందిన కొవ్వూరు శ్రీనివాసరెడ్డి(39) సజీవదహనమయ్యారు. ఆయన స్వగ్రామం రావులపాలెం మండలం ఊబలంక. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి మృతి చెందడంలో తండ్రి, అలాగే అతని మావయ్య కూడా అతనితోనే కలిసి ఉంటున్నారు. శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు సోదరిలకు వివాహం చేశారు. వారంతా రావులపాలెంలోనే స్థిరపడ్డారు. దీంతో శ్రీనివాసరెడ్డి కుటుంబం కూడా రావులపాలేనికి వచ్చేసింది. రావులపాలెంలోని ఆదిలక్ష్మినగర్ ఐదో వీధిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వీరందరికీ శ్రీనివాసరెడ్డే దిక్కు. ప్రస్తుతం ఆయన పని చేసే క్రేన్లు బెంగళూరులో ఉన్నాయి. అక్కడ పనిచేసేందుకు శ్రీనివాసరెడ్డి వెళ్లాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 22న రావులపాలెం నుంచి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం రాత్రి బెంగళూరు వెళ్లేందుకు హైదరాబాద్‌లో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. కర్నూలులో జరిగిన ప్రమాదంలో సజీవ దహనమయ్యాడు. ఆయన మృతి వార్త తెలియగానే రావులపాలెంలో విషాదం నెలకొంది. మృతుని ఇల్లు రోదనలతో నిండిపోయింది. ఇంటికి దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

కె.గంగవరంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె. గంగవరం మండల కేంద్రంలో శుక్రవారం పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, టి ట్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి సుభాష్ అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బెంగళూరు సంస్థలు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి పైగా ఉచిత వైద్యం మందులు పొందారన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పిల్ ఎండి అఖిల్ మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మామిడికుదురు

గెద్దాడ లో రింగ్ రోడ్డునిర్మాణపనులు కు రాజోలు ఎం ఎల్ ఎ దేవ వరప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు దుస్థితి గురించి గ్రామస్తులు పలుసార్లు విన్నవించడంతో రూ 60 లక్షలతో 1.350 కి.మీ మేర రింగ్ రోడు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎంఎల్ఎ అన్నారు . నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఏమిటో కూటమి ప్రభుత్వము ప్రజలకు చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గుబ్బల గీతా భవాని, గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, చాగంటి స్వామి, ఎంపిటిసి జవ్వాది పద్మావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - పి.గన్నవరం

భార్యపై చాకుతో గాయపరిచిన భర్త నేలపూడి గంగరాజును శుక్రవారం ఉడిమూడిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. దీపావళి రోజు రాత్రి నిందితుడు గంగరాజు తన భార్య పల్లాలమ్మను చాకుతో చంపుతామని బెదిరించి, కత్తితో గొంతులో ఆమె పొడిచాడు. ఈ ఘటనలో ఆమె తల తిప్పడంతో కంటి పై భాగంలో బలంగా గాయమైంది. కాకినాడ జిజిహెచ్‌లో సర్జరీ చేసి చాకును తీశారు. దీంతో ఆమె చికిత్స పొందుతోంది. నిందితుడు గంగరాజను కొత్తపేట మెజిస్ట్రేట్ ముందు హాజరపరిచి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇసుక లారీల స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

అధిక లోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను అధికారులు పట్టుకున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరులో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఇసుక ర్యాంపులను తనిఖీ చేశారు. దొండగుంట గ్రామంలోని డిసిల్టేషన్ రీచ్ వద్ద పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకని తదుపరి చర్యల కోసం సంరక్షణ నిమిత్తం కొవ్వూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పబ్బితి రెడ్డి సుధీర్ రెడ్డి పేరుతో ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం రాజవరం గ్రామానికి నాలుగు లారీల్లో ఒక్కొక్క లారీకి సుమారు 36 టన్నుల ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి ఈ నెల 23 మధ్య మొత్తం 2071 మెట్రిక్ టన్నుల ఇసుక పొందినట్లు అధికారులు గుర్తించారు. రాజవరంలో అధికారులు తనిఖీ చేసినప్పుడు ఎటువంటి ఇసుక నిల్వలు లేవని నిర్ధారించారు. ఈ ఇసుక తెలంగాణ రాష్ట్రానికి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని మైనింగి ఎడి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి.జ్యోతిర్మయి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకురాలి అరెస్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను మారుస్తోందనే అభియోగంపై వైసిపి మహిళా విభాగం నాయకురాలు అనుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో ఉండగానే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ భరత్ తన అనుచరులతో త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అను అరెస్ట్‌పై పోలీసులను నిలదీశారు. ఈ సందర్భంగా పోలీసులకు, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. తమ నాయకులను, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేస్తోందని, వేధింపులకు గురి చేస్తోందన్నారు. బాలిక అత్యాచార ఘటనపై శాంతియుతంగా ధర్నా చేశాం తప్ప ఎవర్నీ అగౌరవ పర్చలేదన్నారు. గురువారం బిసి హాస్టల్ వద్ద వైసిపి నిర్వహించిన ధర్నా సమయంలో సమీపంలోని గోడలపై కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను అను మార్చారనే అభియోగంపై అనుపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. భరత్ వెంట వైసిపి నాయకులు మజ్జి రాంబాబు, గుర్రం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

140 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 140 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7లక్షల వరకూ ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటలకు రైలు సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మూడో నెంబర్ ప్లాట్‌ఫామ్‌కి చేరుకుంది. ఈ సమయంలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ఎస్1 నుంచి ఎస్6 వరకు ఉన్న స్లీపర్ బోగీలను పరిశీలించగా యజమానులు లేని 15 సంచులు లభించాయి. వాటిలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వాటిని తూకం వేయగా 140 కేజీలు ఉన్నట్టు గుర్తించారు. మేరకు కేసును నమోదు చేశారు. ఈ సంచులు ఎవరు తీసుకొచ్చారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్ఐ వాసు, ఎఎస్ఐలు వరప్రసాద్, సత్యనారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.


రెయిన్ కోట్లు అందజేస్తున్న ఎంపిడిఒ రాజు

రెయిన్ కోట్లు అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపిడిఒ ఎ.రాజు, ఎంఇఒ బి.అప్పాజీ శుక్రవారం రెయిన్ కోట్లు అందచేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు సామాజిక సందేశ వీడియోలను సోషల్ మీడియాలో చూసిన ఏడిద వాసి టిడిపి నాయకులు వాసంశెట్టి శేష్ కుమార్ స్పందించి విద్యార్థులు వర్షంతో ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో రెయిన్ కోట్లు సమకూర్చి వితరణ చేశారు. అలాగే నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమగు మిక్సీని బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రెయిన్ కోట్లు, మిక్సీని బహుకరించిన దాతలను ఎంపిడిఒ రాజు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్ దుర్గాదేవి, టిడిపి సీనియర్ నేత వైట్ల శేషుబాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రభుత్వం నుంచి విద్యుత్తు, ఇన్సూరెన్స్, బ్యాంకుల నుంచి రుణాలు కోసం ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆర్‌డిఒ పి.శ్రీకర్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీకర్ ఆధ్వర్యంలో రాజోలు మత్స్య శాఖ సహాయ సంచాలకులు యల్‌బి యస్.వర్ధన్,కొత్తపేట డివిజన్ పరిధిలోని మత్స్య శాఖాధి కారులతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాయవరం మండలం కొమరిపాలెం వద్ద శ్రీలక్ష్మీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ నందు ఈ నెల 8న జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మరణించిన బాధిత 10 కుటుంబాలలో ఒక్కొక్క కుటుంబానికి రూ 15 లక్షలు చొప్పున ఎక్స్గ్రేషియాను అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎంఎల్ఎలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేశారు. పంపిణీ చేశారు. కొమరిపాలెం పంచాయతీరాజ్ కళ్యాణ మండ పంలో నిర్వహించిన ఎక్స్ గ్రేషియా చెల్లింపు పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ బాణసంచా ప్రేలుడు ప్రమాదంలో మరణించిన వారు అత్యంత పేదకుటుంబాల వారని, కూటమి ప్రభుత్వం వారిని అన్ని విధాల ఆదుకోవాలని సంకల్పంతో కార్మిక సంక్షేమ శాఖ ద్వారా ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందజేశామని అన్నారు. అదేవిధంగా మరణించిన వారిలో ఎనిమిది మంది బాధితులకు టిడిపి సభ్యత్వం ఉన్నందున ఒక్కొ క్కరికి రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం కూడా అందుతుం దన్నారు. కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యజ మాని బాధిత కుటుంబాల వారికి ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున నష్టపరిహారంగా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దేవరకొండ అఖిల, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్


వర్షంనీటిలో వెళుతున్న విద్యార్థులు

భారీ వర్షాలతో అవస్థలు

ప్రజాశక్తి -అమలాపురం

భారీ వర్షాల కారణంగా శుక్రవారం అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, విద్యుత్ నగర్, గారపాటి వీధి, మహిపాల వీధి, రవణం వీధి, సావరం తదితర ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేసిన చర్యలలో మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతకు ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి: ఎంపీ

ఎంపీ హరీష్ కృషితో 26 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్

ఎన్‌డిఎ ప్రభుత్వం పరిపాలనలో ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, ఉద్యోగ భద్రతకు కూడా కృషి చేస్తామని ఎంపీ హరీష్ మాదుర్ తెలిపారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ముమ్మళ్ల నియోజకవర్గం మల్లవరం గ్రామంలో ఉన్న ఒఎన్‌జిసి, హెచ్‌పిహెచ్‌టి అసెట్‌లో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో పని చేస్తున్న 26 మంది ఉద్యోగాలు కోల్పోయాయని భావించిన వారికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ తిరిగి ఉద్యోగాలు ఇప్పించి వారిని ఆదుకున్నారు. ఈ మేరకు అమలాపురం పట్టణం ఎర్రవంతెన సమీపంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎంపీ హరీష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు కంపెనీలో ఇటీవల నూతనంగా వచ్చిన కంపెనీ గత 16 ఏళ్ళుగా అక్కడ ఉద్యోగం చేస్తున్న 26 మందిని వివిధ కారణాలతో వేరే రాష్ట్రాలకు బదిలీ చేయడం లేదా ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నం చేసిందన్నారు. ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చామన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి సదరు ఉద్యోగులను ఎటువంటి బదిలీ లేకుండా చేసి తిరిగి వారి ఉద్యోగాలు వారికే వచ్చేలా ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుతో కలిసి చర్యలు తీసుకున్నానని ఎంపీ చెప్పారు. అలాగే గత నెల రోజులుగా విధులు నిర్వహించక పోయినా సదరు కంపెనీతో మాట్లాడి నెల జీతం కూడా ఇప్పించామన్నారు. అదే కాకుండా గతంతో రూ.23 వేల జీతం ఉంటే దానిని పెంచి సుమారు రూ.40 వేల వేతనం చెల్లించేలా ఆ కంపెనీ అధికారులతో చర్చలు జరిపి పెంచే విధంగా చేశానని చెప్పారు.

ఆనందం వ్యక్తం చేసిన ఉద్యోగులు

తమ ఉద్యోగాలు తిరిగి పొందడమే కాకుండా జీతాలు కూడా పెరగడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.తమ జీవితాలలో వెలుగులు నింపిన ఎంపీ హరీష్‌ను గజ మాలతో సత్కరించి ఉద్యోగులు కతజ్ఞతలు తెలిపారు.

మహిళా సాధికారత చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - రాజోలు


గొల్లపల్లి అమూల్య

నాడు డ్వాక్రా సంఘాలను ప్రారంభించి మహిళల జీవితాలలో వెలుగులు నింపిన సిఎం చంద్రబాబు తోనే మహిళా సాధికారత కూడా సాధ్యమని టిడిపి రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. ఆమె విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ మహిళల స్వయం సహాయక సంఘాల సంక్షేమంలో సిఎం చంద్రబాబునాయుడు ఫస్ట్ అని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమంలో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని కేంద్ర గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల వెలువరించిందని ఆమె గుర్తుచేశారు. మహిళా సాధికారత, రుణాలు అందజేత వ్యాపారాభివృద్ధి వంటి అంశాలలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని కేంద్రం ప్రశంసించిందన్నారు. ఈ సంఘాల ద్వారా కూటమి ప్రభుత్వంలో రూ.34,83,725 కోట్లను అందజేసిన ఘనత సిఎం చంద్రబాబుదేనని అన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడంలో పాటు వాటి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

ఆహార పదార్థాల కల్తీ, భద్రతపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో ఇటీవల ఆహార పదార్థాల కల్తీపై పలు ఫిర్యాదులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆహార పదార్థాల కల్తీ, భద్రతపై స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు జెసి టి.నిషాంతి వెల్లడించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఆహార భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ఇటీవల దసరా, దీపావళి సందర్భాలలో పలు ఫిర్యాదులు ఆహార కలుషితంపై అందాయని వీటిని దృష్టిలో ఉంచుకొని కాకినాడ, రాజమండ్రి ఆహార భద్రతా అధికారులను స్థానికంగా డిప్యూటేషన్‌పై నియమించి స్పెషల్ డ్రైవ్లు, ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖల అధికారులు, పోలీసు అధికారుల సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆహార విక్ర యించే హోటల్ దుకాణాలను నిబంధన మేరకు తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు అతిక్రమించిన వారిని హెచ్చరిస్తూ ఆయా గ్యాపులను పూరించాలన్నారు. కల్తీ కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఫ్రిజ్లో నిలువచేసిన, హానికర పదార్థాల విక్రయంపై జరిమానాలు శిక్షలు వంటి తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రజారోగ్యం అనేది చాలా కీలకమైన అంశమని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా పాల ఉత్పత్తి, డైరీలు, హోటల్లు క్రమంగా తనిఖీ చేసి కల్తీకి ఆస్కారం లేకుండా పటి ష్టమైన చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రో లర్ విశ్వేశ్వరరావు, జిల్లా ఆహార భద్రతఅధికారి వై రామయ్య, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జివిబి నందాజి (కాకినాడ) డిపిఒ పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.



నంగవరంలో కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నాయకులు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - యంత్రాగం

పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు కోటి సంతకల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

ఉప్పలగుప్తం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో శుక్రవారం నంగవరం, సన్నవిల్లి గ్రామాల్లో వైసిపి శ్రేణులు కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. నంగవరంలో స్థానిక సర్పంచ్, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, సన్నవిల్లిలో స్థానిక ఎంపిటిసి సభ్యురాలు వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజకుమారి అధ్యక్షతన జరిగిన రచ్చ బండ కార్యక్రమంలో కోటిసంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమాలలో జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, గొల్లవిల్లి సర్పంచ్, వైసిపి మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జొన్నాడ శ్రీదుర్గ, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచం ద్రరావు, వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు జిన్నూరి బాబి,మాజీ సర్పంచ్ లు శీలం సూరిబాబు, తొత్తరమూడి నరసింహారావు, నాయకులు మానే శ్రీను,గెడ్డం కిరణ్ కుమార్,యాళ్ళ చిన్న,కోటుం లోవరాజు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని కమ్మవారి సావరంలో నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్ 19 వార్డులో 'కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాదం శెట్టి శ్రీధర్, కౌన్సిలర్ సీతారామలక్ష్మి, సత్తి శంకర రెడ్డి, వార శ్రీనివాస్, యనమదల శ్రీను, కుడిపూడి వెంకటరమణ, యనమదల నాని తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** నగరంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము అధ్యక్షతన శుక్రవారం వైసిపి కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రచ్చబండ మరియు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం నిర్వహించారు కార్యక్రమంలో ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రాష్ట్ర కార్యదర్శిలు సంయుక్త కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

'పాలకుల విధానాల వల్లే ముంపు'

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

రాజోలు నియోజకవర్గం పరిధిలో తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు పడుతున్న ముంపునీటి ఇబ్బందులకు గత పాలకులు, అధికారుల తప్పిదాలే కారణమని బిఎస్‌పి రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లి ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం మోరి గ్రామంలో ఆయన మాట్లాడుతూ గత 15, 20 ఏళ్ల క్రితం నియోజకవర్గంలో అధిక వర్షాలతో తీవ్రమైన ముంపు బాధలు లేవని ఆయన గుర్తు చేశారు. అనధికార చెరువులు, ఇసుక మాఫియాలే ఈ రోజూ ఈ పరిస్థితికి కారణమన్నారు. సముద్రం ప్రక్కన ఉన్న ఇసుక దిబ్బలు ఖాళీ చేసి అమ్మేసుకోవడంతో తుఫానులు, వాయుగుండాల సమయంలో సముద్రపు ఉప్పునీరు ముంచెత్తుతుందన్నారు. అలాగే ఆక్వా చెరువుల ఆక్రమణ, వాటికి కావల్సిన సముద్రపు నీరు కొరకు డ్రెయిన్లను ధ్వంసం చేయడం వంటి కారణాలతో ముంపు నీరు డ్రెయిన్ల ద్వారా వెళ్లడం లేదని అయన వివరించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

రాజ్యాంగ అవతరణపై మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఈ నెల 26న భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు హైస్కూల్లో శుక్రవారం ఇన్చార్జి హెచ్‌ఎం డి.సత్యనారాయణ అధ్యక్షతన 8, 9,10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. విజేతలు నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపిక్యయాకని ఎంఇఒలు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబులు పోటీలను పర్యవేక్షించారు.

అన్నదాన భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మిస్తున్నారు. ఈ భవనం నిర్మాణ పనులను కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యా నందరావు శుక్రవారం పరిశీలి ంచారు. పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ.1.50 కోట్లతో అన్నదాన భవనంలో కిచెన్ నిర్మాణం, స్టీమింగ్ బాయిలర్లు ఏర్పాటుకు విరాళంగా అందజేశారు. ఆనంద్ గ్రూప్ ఛైర్మన్ కాశీ విశ్వనాథరాజు వాటర్ ప్లాంట్, బయోగ్యాస్ ఏర్పాటుకు విరాళం అందజేశారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావుతో కలిసి అన్నదాన భవనంలో కిచెన్, స్టీమింగ్ బాయి లర్ల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరావు పాల్గొన్నారు

అన్నదానానికి రూ. లక్ష విరాళం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చి యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు శుక్రవారం సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగ మల్లేశ్వరరావు భానుకళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు

వెంకన్నను దర్శించుకున్న ఎస్‌సి కమిషన్ ఛైర్మన్

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని శుక్రవారం రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనం తరం ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనం తరం ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ టిఆర్. రాజేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటనపై మంత్రి సుభాష్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రయివేటు బస్సు అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు జిజిహెచ్ సూపరింటెండెంటుకు ఫోన్‌లో ద్వారా ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రమాదంలో మతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి తెలి పారు.

బాధాకరం..

సఖినేటిపల్లి : కర్నూల్ లో జరిగిన ఘోర బస్సు ప్రమాదంతో దేశమంతా ఉలిక్కిపడిందని, అంతమంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని వైసిపి సోషల్ మీడియా నాయకుడు జిల్లెల్ల ఉదయ్ కిరణ్ వాపోయారు. ప్రయివేటు బస్సులు భద్రత విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే మల్కిపురం నుండి ప్రతిరోజు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఎపిఎస్ ఆర్‌టిసి ఇంద్ర బస్సు సర్వీసులను నడుపుతోందని, ఈ సర్వీసులో కొన్ని పాత వాహనాలు పలుమార్లు ప్రయాణం మధ్యలో రిపేర్లు గురవుతున్నాయన్నారు. ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్న కాలం చెల్లిన బస్సులను మార్చి, కొత్త బస్సులను ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపిలోకి ఎంపిటిసి సభ్యుడు భాస్కరరావు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం ఎంపిటిసి-2 శీలం భాస్కరరావు శుక్రవారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఆ గ్రామ టిడిపి నాయకులు నెక్కంటి శ్రీరామ్ జీ, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, ఆధ్వర్యంలో మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో టిడిపిలోకి చేరినట్లు భాస్కరరావు తెలిపారు.


క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామప్రసాద్

క్రీడా పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమలాపురం

ఇటీవల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మండల స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీలలో ఆదిత్య పాఠశాల అమలాపురం కామన గురువు విద్యార్థులు అండర్ -17, 14 విభాగాల్లో సత్తాచాటి విజయకేతనం ఎగరవేశారు. అండర్-17 విభాగంలో ఎస్.బాల మణికంఠ సాయి (10 వతరగతి) 100 మీటర్ల పరుగులో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రెండో స్థానం, కె.దిలీప్‌కుమార్ (10 తరగతి) 200 మీటర్ల పరుగులో 3వ స్థానం, పి.ధనకష్ణ వినయ్ (9వ తరగతి) ట్రిపుల్‌జంప్‌లో రెండవ స్థానం, యోగాలోఎన్.దిలీప్ కుమార్ (8వ తరగతి) 4 స్థానం, జి.విశ్వ నాథరాజు (9వ తరగతి) షాట్‌పుట్‌లో 4వ స్థానం కైవసం చేసుకున్నారు. కోకోలో పిబి.కార్తికేయ (9వ తరగతి) కె.దీపేష్ (9వ తరగతి)లు విజేతలుగా నిలిచి డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ -14 బాలుర విభాగం షార్ట్‌పుట్‌లో కె.హర్షవర్ధన్ (9వ తరగతి) మొదటి స్థానం, ఎం.యశ్వంత్ (9వ తరగతి) 2వ స్థానం, లాంగ్‌జంప్‌లో బివిఎన్.కళ్యాణ్ (9వ తరగతి) మొదటి స్థానం, కె.లోకేష్ (8వ తరగతి) 3వ స్థానం, 400 మీటర్ల పరుగులో జి.అభినవ రెడ్డి (8 వ తరగతి) మొదటి స్థానం, కోకో ఆటలో ఎం.హనూజ్ సాయి రుద్రాక్ష్ (8వ తరగతి), డి.దీవెనరాజ్ (9వ తరగతి), యోగాలో జి.తనీష్ నాయుడు (7వ తరగతి), ఎం.జశ్వంత్ బాబు (7వ తరగతి)లు, కబడ్డీలో కె.హర్షవర్ధన్ (9 వ తరగతి), డి.షణ్ముఖ్ (9వ తరగతి), ఆర్.భార్గవ్ (9వ తరగతి)లు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అంతే కాకుండా కబడ్డీ టీమ్ మండల స్థాయి రన్నరఫ్‌గా నిలిచారు. అండర్ -14 బాలికల విభాగం యోగాలో టి.కార్తీక సూర్య (8వ తరగతి) 3వ స్థానం, పి.ప్రసన్న లక్ష్మీదేవి (8 వ తరగతి) 4వ స్థానం, ఎం.జెస్సికా లక్ష్మి (8 వతరగతి) 6వ స్థానం, టి.మోహిత (8 తరగతి) 7వ స్థానం, బి.వరలక్ష్మిలు(8వ తరగతి) 8వ స్థానం సాధించి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చదువులోనే కాకుండా ఆటల పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి, డైరెక్టర్ శృతి రెడ్డి, ఆదిత్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ చలపతిరావు, పాఠశాల ప్రిన్సిపల్ రామప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ జి.సుధ విజేతలను ప్రశంసించారు. శిక్షణ ఇచ్చిన పిఇటిలు కె. విజయకృష్ణ, జి.వెంకట శివ, ఎ.భవానిలను అభినందించారు.

రెజ్లింగ్‌లో వర్షిణికి సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇటీవల విజయవాడలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి 69వ రెజ్లింగ్ పోటీల్లో కాకినాడ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని వడ్డీ మేఘవర్షిణి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించడం పట్ల శుక్రవారం పలువురు విజేతను అభినందించారు. మండలం లోని లంక ఆఫ్ ఠానేలంక గ్రామానికి చెందిన మేఘవర్షిణి ఇటీవల విజయవాడలోని ఎన్‌టిఆర్ జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ -25 ఆటల పోటీల్లో అండర్ -19 రెజ్లింగ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ గెలుచుకుంది. విజేత రెజ్లింగ్ పోటీల్లో 59 కేజీల విభాగంలో విజేతగా నిలిచింది. విజేతలను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుతో పాటు నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కొమనపల్లి సొసైటీ అధ్యక్షులు పొద్దోకు బాలు (కొమానపల్లి), గోదాసి పుండరీష్(ఠానేలంక) ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్(అప్పా) అధ్యక్షుడు పిల్లా చంద్రం, రాష్ట్ర కార్యదర్శి రేవు సురేష్‌బాబు, వడ్డి శ్యామ్ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

జనార్ధన స్వామి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి -ఆలమూరు

ఆలమూరు నవ జనార్ధనస్వామి ఆలయానికి శుక్రవారం యాత్రికులు పోటెత్తారు. విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు నవ జనార్ధన క్షేత్ర సందర్శనలో భాగంగా ప్రత్యేక బస్సులో ఆలమూరు వచ్చారు. వారికి ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు సాదర స్వాగతం పలికారు. అర్చకులు అంగర భగవానాచార్యులు వారికి స్వామివారి దర్శనం చేయించి, క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి దర్శనం చేయించడం సంతోషం కలిగించిందన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా వ్యాప్తంగా 8,9,10 విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సాయంతో అభిరుచులు సామర్థ్యాలు తెలుసుకొని, భవిష్యత్తులో సరైన విద్యా, వృత్తి రంగాలు ఎంపిక చేసేందుకు మార్గనిర్దేశం చేస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడిం చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు మామిడికు దురు ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి ఎం.నవీన్ జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, మాస్టర్ ట్రైనీల 19 మందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ కెరీర్ చార్ట్ ప్రదర్శన వెబ్ పోర్టల్ ద్వారా కెరీర్ కౌన్సిలింగ్ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.